క్లుప్తంగా

అనధికార లేఅవుట్‌ల గుర్తింపు



అనధికార లేఅవుట్‌ల వివరాలు ప్రకటిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధి జగ్గమ్మ గారిపేటలో అనధికార లేఅవుట్‌లను గుర్తించామని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో అనధికార లేఅవుట్‌లుగా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వీటిని 15 రోజుల్లో రెగ్యులైజేషన్ చేయించుకోవాలని అన్నారు. స్వయంగా, ఆన్‌లైన్‌లో గాని రెగ్యులరైజేషన్ చేయించుకోవచ్చన్నారు. లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేయడానికి మున్సిపల్ నోటీసు బోర్డులో అనధికార లేఅవుట్‌ల వివరాలను ప్రకటించామని వివరించారు.

భూమికి పట్టాలు ఇవ్వాలని వినతి

కొత్తపల్లి: తాము సాగు చేసుకుంటున్న బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. చెందుర్తిలో సర్వే నంబర్-1లో ప్రభుత్వ బంజరు భూములను తాము గత 30 సవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

హౌసింగ్ అధికారులపై ఫిర్యాదు

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం పి.వేమవరంలో తన సోదరి పసుపులేటి సుజాతకు చెందిన ఇంటి వద్ద వేరే వ్యక్తిని పెట్టి హౌసింగ్ అధికారులు ఫొటోలు తీసి రుణం ఇచ్చారంటూ మేడిది విఘ్నేశ్వరనాగబాబు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు తన సోదరి ఇల్లును వేరే వ్యక్తి ఇల్లు అంటూ చూపిస్తూ ఆన్‌లైన్‌లో జియో ట్యాగింగ్ చేశారన్నారు. అంతేకాకుండా ఆ వ్యక్తికి రూ. 1.28 లక్షల హౌసింగ్ రుణం కూడా ఇచ్చారన్నారు. సదరు అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగబాబు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కృతికా శుక్లా వారం రోజుల్లో దీనిపై రిపోర్టు సమర్పించాలని, తప్పు చేసిన వారిని సస్పెండ్ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు.

ఖోఖో పోటీలకు కిట్స్ విద్యార్థులు

పెద్దాపురం: ఉత్తరప్రదేశ్‌లో వచ్చే నెలలో నిర్వహించే ఆల్ ఇండియా ఖోఖో పోటీలకు పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడ జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూకే టీం ప్రథమ స్థానం సాధించింది. ఆ టీమ్‌లో కిట్స్ కళాశాలకు చెందిన వై.సతీష్, బి.రామసురేష్, జె.నితీష్‌లు పాల్గొని ఆల్ ఇండియా ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ఈఓ జెన్నిబాబు, ఏఓ సందీప్, ఇన్‌చార్జి పెద్దకాపు, పీఈ స్వామి, ఆయా విభాగాల హెచ్ఓడీలు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏవైఎం సంఘు నూతన కార్యవర్గం

పిఠాపురం: పట్టణంలోని రథాలపేటలో ఏవైఎం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘ పెద్దలు సాక బాబూరావు, యాళ్ల సత్తిరాజు, చిల్లి లక్ష్మణస్వామి సమక్షంలో ఎన్నుకున్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి సంఘ అధ్యక్షుడిగా చిల్లి నూకరాజు, ఉపాధ్యక్షుడిగా పూలపకూరి చంద్రశేఖర్, కార్యదర్శిగా మైనపాటి రాజు, ఉప కార్యదర్శిగా లంకా ప్రసన్నకుమార్, ట్రెజరర్‌గా కూసి నూకరాజు, క్రీడా కార్యదర్శిగా శీకోటి శ్రీను, ప్రచారకుడిగా మాతా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని సంఘ నూతన అధ్యక్షుడు నూకరాజు తెలిపారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించి చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో శీకోటి అప్పలరాజు, దానం లాజరు బాబు, దానం రాజర్, గుర్రాల ఏసురత్నం, పెదపాటి రాజేష్, నందక శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుందాం..

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకుడు పెదిరెడ్ల సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండలు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను కలసికట్టుగా అడ్డుకోవాలన్నారు. 30న విశాఖలో నిర్వహించే కార్మిక మహాగర్జనలో ప్రతి కార్మికుడు పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మోతాదుకు మించితే అనర్థమే

- అధికంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం
- మేల్కొనకపోతే ముప్పు తప్పదంటున్న అధికారులు
- నియోజకవర్గంలో 15,245 హెక్టార్లలో వరి సాగు



ఎరువులు కలుపుతున్న కూలీలు



పురుగుల మందును పిచికారీ చేస్తున్న రైతు



వరి పొలంలో ఎరువులు చల్లుతున్న రైతు

కొత్తపల్లి: పంటల సాగులో ఎరువులు, పురుగు మందులను అధిక మోతాదులో వినియోగిస్తుండటం వల్ల భూములు నిస్సారవంతంగా మారుతున్నాయి. వీటిలో పండించే పంట ఉత్పత్తులపై రసాయనాల ప్రభావం పడుతోంది. రసాయన ఎరువులు అధికంగా వాడితే కొత్త రకం తెగుళ్లు పుట్టుకు రావడంతో పాటు ఆహార నియమావళిని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల రైతులకు అన్నివిధాలా నష్టం కలుగుతోంది. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఈ ఏడాది 15245 హెక్టార్లలో రైతులు రబీ వరి సాగు చేశారు. కొత్తపల్లి మండలంలో 4326, గొల్లప్రోలు మండలంలో 3133, పిఠాపురం మండలంలో 7786 హెక్టార్లలో రైతులు వరిపంట సాగు చేస్తున్నారు. నాట్లు పూర్తి కావడంతో రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

లైను ఊడ్పులకు ప్రాధాన్యం

రైతులు ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఊడ్చే లైన్ ఊడ్పు(తాడు ఊడ్పు)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. నియోజకవర్గంలో 40 శాతం పైగా రైతులు ఈ పద్ధతిలోనే నాట్లు వేశారు. బీహార్, బెంగాల్ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలో నెల్లూరు, గుంటూరు నుంచి అధిక సంఖ్యలో కూలీలు వ్యవసాయ పనుల కోసం వలస వస్తున్నారు.

ఖర్చు తగ్గుతోంది

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు తక్కువ రేట్లకే వ్యవసాయ పనులు చేయడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. అంతేకాకుండా పనిభారం కూడా తగ్గుతోంది. 16 నుంచి 20 రోజుల వ్యవధిలో వేసిన నారుమడులను ఆకు తీసుకుని వారే ఊడ్పు అప్పగిస్తారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం



రైతులు భూసార పరీక్షల ఆధారంగానే పంట సాగుతో పాటు ఎరువులు వినియోగించాలి. అనవసర వాడకం అధికమైతే భూమి నిస్సారమైపోతుంది. అంతేకాకుండా చౌడు నేలగా మారే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువులు వినియోగంపైనే రైతులు దృష్టి సారించాలి. దీంతో భూసారం పెరిగి ఆశించిన దిగుబడులు వస్తాయి. రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పని సరిగా పాటించాలి.

జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

మహా శివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



సామర్లకోట పంచారామ క్షేత్రంలో పందిరిరాట వేస్తున్న ఈఓ, ట్రస్టు బోర్డు సభ్యులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు సోమవారం పందిరిరాట వేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఫిబ్రవరి 16 నుంచి 21 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. 16వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం, 18న మహాశివరాత్రి, 19న రథోత్సవం, 21న స్వామివారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించేందుకు, చలువ పందిర్లు వేయడానికి ముహూర్తపు రాటను వేశామని ఈఓ తెలిపారు. సోమవారం నుంచి ఉత్సవాలకు సంబంధించిన పనులను ప్రారంభిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణపై వచ్చే నెల వివిధ శాఖల అధికారులతో కాకినాడ ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, నేతల వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్యాన మహాసభ

సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ధ్యాన మహాసభ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి వాస్తవ్యులు మునిబాబుచే ఈ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మునిబాబు మాట్లాడుతూ భగవంతుడిని ఏకాగ్రతతో పూజించాలన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటం ద్వారా సేవాభావం అలవడుతుందన్నారు. ఆలయ పారాయణ కమిటీ అధ్యక్షురాలు సత్తి అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సభ్యులు యార్లగడ్డ శ్రీను, మద్దుకూరి జోగారావు, కంటే అబ్బు, పెనుమర్తి పెద్దబ్బు, గోలి రాంబాబు, సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జునరావు, టి.సుబ్బారావు, సత్యనారాయణ, రఘు తదితరులు భక్తులకు సేవలందించారు.

కలెక్టర్ దృష్టికి రైతుల సమస్య

కాకినాడ సిటీ: ఏలేరు అభివృద్ధి పనులలో భాగంగా పిఠాపురం మండలం గోకివాడ, కోలంక ప్రాంత రైతుల నుంచి 8.56 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వం పేపరు ప్రకటన ఇచ్చిందని, దీనికి సంబంధించి ఎటువంటి అవార్డు ఇవ్వలేదని ఆ ప్రాంత రైతులు అన్నారు. దీనిపై వారు ఎంపీ వంగా గీతతో కలసి కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చి కలెక్టర్ కృతికా శుక్లాకు వివరించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతులకు రావాల్సిన ఆర్థిక సహాయం అందించాలని ఎంపీ వంగా గీత కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. రైతుల నుంచి భూమి ఏలేరు అభివృద్ధికి అవసరమని 2017, 2019లో పేపర్ నోటిఫికేషన్ ద్వారా 22 మంది రైతులకు సంబంధించిన భూమి తీసుకుంటున్నట్లు ప్రకటన ఇచ్చారన్నారు. కానీ భూమి ఇప్పటికీ తమ స్వాధీన హక్కు భుక్తంలోనే ఉందని రైతులు వివరించారు. రైతులకు రావాల్సిన అవార్డు ఇవ్వలేదని, పేపరు ప్రకటనలో ఇచ్చిన విధంగా భూములను తగ్గించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని తమ దృష్టికి తేవడంతో కలెక్టర్‌కు వివరించినట్లు ఎంపీ గీత తెలిపారు. దీనిని పరిష్కరించేందుకు కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల మేలు కోసం అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. ఎంపీ వెంట ఏలేరు ప్రాంత రైతులు నంద్యాల నాగభూషణం, నంద్యాల వెంకటరావు, మిరియాల చంద్రరావు, పాలింకి అప్పారావు, మిరియాల పేర్రాజు తదితరులు ఉన్నారు.

చంద్రబోస్‌కు ఘన నివాళి

సామర్లకోట: జాతీయ నాయకుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీ తాళ్లూరి వైకుంఠం, ఏఎల్‌వీ కుమారి, జి.గోవింద్, కేవీవీ సత్యనారాయణ, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి జనసేన పార్టీ నాయకుడు, విష్ణు ఆసుపత్రి అధినేత పిల్లా శ్రీధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పల్నాటి మధు, వాకపల్లి సూర్య ప్రకాష్, మోటూరి మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కరపత్రం ఆవిష్కరణ



కుక్కుటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయక్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల కరపత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 16న ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'స్పందన'



పెద్దాపురం స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ సరస్వతి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి అన్నారు. సోమవారం స్పందనకు డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఆరు అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. భూరీసర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సామర్లకోట: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తుని అగ్నిమాపక అధికారి రామకృష్ణరాజు అన్నారు. స్థానిక ఈటీసీలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల ఆపద మిత్రల శిక్షణకు నాల్గో రోజు సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో కార్బన్‌డైయాక్సైడ్ ద్వారా మంటలు అదుపు చేయవచ్చన్నారు. ఆపద సమయంలో బాధితులను ఏవిధంగా రక్షించాలో ఆపద మిత్రలచే డెమో చేయించారు. ఈ శిక్షణను విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసు, ఆంజనేయులు పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ కోరారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై ప్రజా ప్రతినిధులు, కిరాణా షాపుల యజమానులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 26 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామన్నారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగించకూడదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధక్షుడు పర్ల రాజా, టీడీపీ పార్టీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బన్న, సీపీఎం నాయకులు కేశరపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పిఠాపురం: తమ ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని స్థానిక 30వ వార్డుకు చెందిన మహిళలు సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. 30వ వార్డులోని అగ్రహారం నుంచి రాపర్తి వెళ్లే మార్గంలో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీరు అందడం లేదని, డ్రైనేజీలు లేక పోవడంతో మురుగునీరు, వర్షపు నీరు ఇళ్ల మధ్య నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మున్సిపల్ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. అనంతరం భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

కొత్తపల్లి: చేనేత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చేనేత కార్మికులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. చేనేత మగ్గాలను పరిశీలించి చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకంలో సంవత్సరానికి రూ.24 వేలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చేనేతపై జీఎస్టీ తగ్గించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. పంచుమర్తి లక్ష్మీభీమేష్, సర్పంచ్ కట్టా భల్లేశ్వరావు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో మనదే పైచేయి

- ఇతర రాష్ట్రాలకు జగన్ పాలన ఆదర్శం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : పథకాల అమలులో మన రాష్ట్రానిదే పైచేయిగా నిలుస్తుందని, ఇతర రాష్ట్రాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదర్శంగా మారిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. సోమవారం పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలి అనురాధ, కన్వీనర్ కేఈడీ రాజు, ఎలుబండి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, నల్లల నాగేంద్రబాబు, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొరతో కలసి సుమారు మూడున్నర గంటల పాటు దొరబాబు ఇంటింటా పర్యటించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న పథకాలపై ఆరా తీశారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలంటూ ప్రజలను అడిగారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టి త్రినాథ్, కామన రామకృష్ణ, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, సిరిపురపు వడ్డికాసులు, నాళం త్రిమూర్తులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పిఠాపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 12వ వార్డులో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులకు సైతం అనేక సంక్షేమ పథకాలు వర్తించాయన్నారు. గత ప్రభుత్వంలో అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. గతంలో పెన్షన్ల కోసం పంచాయతీల వద్ద రోజుల తరబడి వృద్ధులు నిరీక్షించేవారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు వలంటీర్ల వ్యవస్థ ద్వారా పెన్షన్ల నగదు అందుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొజ్జ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జి , బొజ్జ మాణిక్యాలరావు, బొజ్జ దొరబాబు, సచివాలయ కో ఆర్డినేటర్ బాలిపల్లి రాంబాబు, దేవా, మట్టం రాజు, పెద్దపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దొరబాబుకు సత్కారం



సామర్లకోటలో దొరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆవాల రాజేశ్వరి

సామర్లకోట: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి సోమవారం కలిశారు. రెండో పర్యాయం రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి రావడానికి కృషి చేసిన దొరబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు అన్ని రంగాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ యూత్ అధ్యక్షుడు దేగల భాస్కరరావు, కర్రి శ్రీను, ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి రైతే వెన్నెముక



రైతు సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి

పెద్దాపురం: దేశానికి రైతే వెన్నెముక అని, రైతు లేనిదే అభివృద్ధి సాధ్యపడదని అఖిల భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం తాటిపర్తి గ్రామంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి అధ్యక్షతన జిల్లా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సులో శ్రీధర్‌రెడ్డి, నారాయణమూర్తి మాట్లాడుతూ 26న గణతంత్ర దినోత్సవం, మార్చి 4న సంఘ్ స్థాపనా దినోత్సవం, వినాయక చవితి వెళ్లిన మూడో రోజు వచ్చే షష్ఠి రోజున బలరాముడు జయంతి సందర్భంగా రైతు దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. రైతు బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని నేటి యువత తెలుసుకోవాలన్నారు. ఆధునిక టెక్నాలజీ పేరుతో వ్యవసాయం దండగ అనే ప్రతి ఒక్కరికీ ఈ రోజు వ్యవసాయం, రైతు కష్టం తెలుస్తుందన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చ జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కొలూరు పతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, జిల్లా మహిళా ప్రముఖ్ దాడిశెట్టి పావనిలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి జాజిమొగ్గల ఈశ్వరరావు, జిల్లా సభ్యులు సామిరెడ్డి సత్యానందం, రాము తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లు ఉండాలనేదే లక్ష్యం



సామర్లకోటలో ఓటీఎస్ పట్టాలు అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్లు

సామర్లకోట: ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఓటీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అన్నారు. సోమవారం స్థానిక పదో సచివాలయం పరిధిలో ఓటీఎస్ పట్టాల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హౌసింగ్ రుణాలు తీసుకుని ఇంటిపై హక్కు లేకపోవడంతో అనేక మంది ఇంటిపై బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి లబ్ధిదారులకు పట్టాలు అందజేయడమే కాకుండా ఆస్తి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. తద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో రెండో వైస్ చైర్‌పర్సన్ గొకిన సునేత్రదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో 40 మందికి పట్టాలు పంపిణీ చేశారు.